నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | NALGONDA

నల్లగొండ నుంచి భువనగిరికి సెమీ డీలక్స్ బస్సు

డిపోకు వచ్చిన సెమీ డీలక్స్ బస్సు

నల్లగొండ సిటీ సెప్టెంబరు 17 : ప్రయాణికుల సౌకర్యార్థం నల్లగొండ డిపోకు ప్రత్యేక సెమీ డీలక్స్ బస్సును కేటాయించినట్లు ఆర్ఎం రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సును నల్లగొండ నుంచి భువనగిరికి బుధవారం నుంచి నడుపనున్నట్లు పేర్కొన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఒక బస్సును కేటాయించారని, మరో నాలుగు బస్సులు గురువారం రానున్నట్లు తెలిపారు. సెమీ డీలక్స్ బస్సులో మహాలక్ష్మి పథకం వర్తించదని చెప్పారు.

నల్లగొండ పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తదితరులు

దేవరకొండలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నాయకులు


నకిరేకల్ : ఇందిరాగాంధీ సెంటర్‌లో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

రేవంత్ సర్కారుపై నిరసనల వెల్లువ

సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం పట్ల ఆందోళన

తెలంగాణ తల్లిని అవమానించడంపై మండిపాటు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం

రాష్ట్ర సచివాలయానికి ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహానికి బదులుగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. మంగళ వారం తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య, దేవరకొండలో ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి పలుచోట్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలుపుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ తదితరులు

మిర్యాలగూడలో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి


నల్లగొండ ఎన్జీ కాలేజ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటు తెలంగాణ ప్రజలను అవమానించడమే

బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 17 : తెలంగాణ రాష్ట్రం పేరు ఎత్తితే తుపాకులతో కాల్చి చంపుతామన్న వారే నేడు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బదులు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఇది తెలంగాణ ప్రజలను అవమానించడమేనని బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు సూర్యాపేట పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బడుగుల మాట్లాడుతూ తెలంగాణ పేరు ఉచ్చరించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గెలిపించడం తెలంగాణ ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను పదేండ్లు అన్ని వర్గాల ఆమోదంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసుల అండతో చేస్తున్న దుందుడుకు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెకు గుణపాఠం తప్పదు

బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), సెప్టెంబర్ 17 : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా పాలన సాగిస్తున్నారని.. కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సెక్రటేరియట్‌లో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన మంగళవారం దేవరకొండలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ రేవంత్ సర్కారు ప్రజా వ్యతిరేకిస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తెలంగాణ ప్రజలను అవమానించడమేన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టీవీఎన్ రెడ్డి, చింతపల్లి సుభాశ్, ముక్కమల యాదయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, ముత్యాల రవి, శంకర్‌నాయక్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, తులసిరాం, ఆరెకంటి రాములు, మధు, నర్సింహ, లక్పతినాయక్, సత్తార్, ఇలియాస్ పటేల్, వాజిద్, బాబా, యాదయ్య, వెంకట్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

అసమాన త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు

సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లాది కీలకపాత్ర

- ఎందరో యోధుల పోరాటంతోనే ప్రజాస్వామ్యంలోకి..
- మలిదశ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన తెలంగాణ
- ప్రజా పాలన దినోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆటంకం.. డీఈఓపై అదనపు కలెక్టర్ సీరియస్

నీలగిరి, సెప్టెంబర్ 17 : నిజాం నిరంకుశ పాలనలో విసిగి వేసారిన తెలంగాణ ప్రజానీకం రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్యంలోకి అడుగు పెట్టేందుకు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మంగళవారం స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న ఇండియన్ యూనియన్‌లో విలీనమైన తెలంగాణ ఈ 77 ఏండ్లలో ఎంతో ప్రగతి సాధించిందన్నారు. ఎందరో త్యాగధనుల పోరాటంతో నేడు అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం ముందుకు దూసుకు వెళ్తున్నదన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో, స్వాతంత్ర్య సంగ్రామంలో అమరులైన యోధులకు నివాళులర్పించారు. ఎందరో మహానుభావాలు ఈ గడ్డ మీద చేసిన అసమాన త్యాగాల ఫలితమే ఈనాటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అని పేర్కొన్నారు. ఆ త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అభివృద్ధికి నాంది అని తెలిపారు.

రాచరికపు వ్యవస్థకు వ్యతిరేక పోరాటంలో నల్లగొండ పాత్ర కీలకం..

ఆనాటి రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభల ద్వారా ఎంతోమంది పోరాటం చేయగా.. అందులో నల్లగొండ కమ్యూనిస్టులు కీలకంగా వ్యవహరించారని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, జిట్టా రామచంద్రారెడ్డి, కట్కూరి రామచంద్రారెడ్డి, సుశీలాదేవి, సుద్దాల హనుమంతు, బొందుగుల నారాయణరెడ్డి, ఎర్రబోతు రాంరెడ్డి వంటి ఎందరో ముందుండి పోరాడారన్నారు. దొడ్డి కొమురయ్య మరణంతో సాయుధ పోరాటం తీవ్రమైందని గుర్తుచేశారు. ఆనాటి పోరాటంలో చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి కీలక పాత్ర పోషించారన్నారు. నల్లగొండ జిల్లా నుంచి బండి యాదగిరి రాసిన బండెనక బండి కట్టి పాట, వెట్టి చాకిరీని వ్యతిరేకిస్తూ సుద్దాల హనుమంతు రాసిన పాలబుగ్గల జీతగాడా పాటరాచరిక ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడానికి ప్రజల్లో చైతన్యం రగిలించాయని తెలిపారు. గుండ్రాంపల్లి, కడివెండి, రావులపెంట, ఏనెమీదిగూడెం ప్రాంతాలు ఉద్యమానికి కేంద్ర బిందువులుగా నిలిచాయన్నారు.

పార్లమెంట్‌లో అట్టుడికిన తెలంగాణ....

తొలిదశ ఉద్యమంలో పెద్దమనుషుల ఒప్పందం అమలు కాకపోవడంతో దానికి వ్యతిరేకంగా విద్యార్థులు, మేధావులు ఉద్యమించి దాదాపు 300 మంది అమరులయ్యారని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్, జలగం వెంగళ్‌రావు, టీఎన్ సదాలక్ష్మి, మదన్ మెహన్, మర్రిచెన్నారెడ్డి తదితరులు ముందుడి తొలిదశ ఉద్యమాన్ని నడిపించారన్నారు. అప్పట్లో అవకాశాలను అందరికీ సమానంగా అందించాలనే ఉద్దేశంతో ఇందిరాగాంధీ ఏర్పాటు చేసిన జోనల్ వ్యవస్థ తెలంగాణ ప్రజల అకాంక్షను తీర్చలేక అన్యాయాలను ఆపలేకపోవడంతో 2011 నుంచి మలిదశ ఉద్యమం తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి పేరుతో ప్రారంభమైందని తెలిపారు. జిల్లాకు చెందిన కాసోజు శ్రీకాంతాచారితోపాటు ఎందరో యువకులు ప్రాణం త్యాగం చేశారని గుర్తుచేశారు. ఓవైపు మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, సాగర హారం వంటి మహత్తర ఉద్యమాలు నడుస్తుంటే, మరోవైపు పార్లమెంట్‌లో ఎంపీలు తమ గళాన్ని బలంగా వినిపించారన్నారు. తెలంగాణ బిడ్డల త్యాగాలను, పోరాటాలను చూసి చలించిన సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర సాధనలో అమరుల త్యాగం వెలకట్టలేనిదన్నారు.

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పలు ఆటంకాలు ఏర్పడడంతో వాటిగా ఇన్‌చార్జిగా ఉన్న డీఈఓపై ఆదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. షెడ్యూల్ ప్రకారం సాంస్కృతిక కార్యక్రమాలకు విద్యార్థులు హాజరుకాకపోవడం, మెక్‌సెట్ పని చేయకపోవడం, పాటలు పూర్తిస్థాయిలో రికార్డింగ్ చేయకపోవడంతో సీరియస్ అయ్యారు.

ప్రజాప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సమాన ఫలాలు..

సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా ముందుకు సాగుతుందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ఇటీవలే తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరును కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి, హ్యాండ్ లూమ్ టెక్నాలజీ సంస్థకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో కొత్త ఉద్యోగ కల్పన కోసం జాబ్ క్యాలండర్‌ను ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్ర మహిళలందరికీ మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.10లక్షలకు ఆరోగ్య శ్రీ పెంపు వంటి అమలుచేస్తున్నట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇస్తున్నట్లు చెప్పారు. నల్లగొండ జిల్లాలో 1.73 లక్షల రైతుకు కుటుంబాలకు రూ.1,433 కోట్లు మాఫీ చేశామన్నారు. నల్లగొండ జిల్లా రైతాంగానికి మరింత అండగా ఉంటానన్నారు. బహుజన ప్రజారాజ్య స్థాపకుడు సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సమీకృత గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీశైలం సొరంగమార్గం, బ్రాహ్మణ వెల్లంల లిఫ్ట్‌తో జిల్లాను సస్యశ్యామలం చేస్తానన్నారు. రూ.275 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, రూ.20 కోట్లతో నర్సింగ్ కళాశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.512.81 కోట్లతో నల్లగొండ జిల్లాలో 241.90 కిలోమీటర్లు మేర రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని త్వరలోనే ఆరు లైన్లకు విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, నేనావత్ బాలూనాయక్, ఆదనపు కలెక్టర్లు శ్రీనివాస్, పూర్ణచంద్ర, ఏఎస్పీ రాములు నాయక్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ధాన్యం కొనుగోళ్లకు ప్రతిపాదనలు పంపాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, సెప్టెంబర్ 17 : రానున్న వానకాలం ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన కేంద్రాల ప్రారంభానికి ప్రతిపాదనలు పంపాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన అధికారుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 400 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మూడు రోజుల్లో ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. టార్పాలిన్లు, తూకం వేసే యంత్రాలు, ధాన్యం తూర్పార పట్టే యంత్రాలు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. అనంతరం ఆయన రైస్ మిల్లర్లతో కస్టమ్ మిల్లింగ్‌పై సమీక్షించారు. 2023-24కు సంబంధించి సెప్టెంబర్ చివరి నాటికి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ 17శాతం పూర్తి చేయాలన్నారు.ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని పర్యవేక్షణ చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డీఎం ఎం.హరీశ్, డీఏఓ శ్రవణ్ కుమార్, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతో రైతులకు ఇబ్బందులు

- కాల్వ గండ్లు పూడ్చేదెప్పుడు.. నీళ్లు వచ్చేదెప్పుడు?
- నీళ్లు లేక వేల ఎకరాలు ఎండిపోయే పరిస్థితి
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్
- ఎండిన పంట పొలాల పరిశీలన

కోదాడ మండలం గణపవరంలో ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ రూరల్, సెప్టెంబర్17 : వానలు, వరదకు పంటలు మునిగింది గోరంత అయితే, కాల్వలకు నీళ్లు రాక ఎండుతున్నవి కొండంత అని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సాగర్ ఎడమ కాల్వకు గండ్లు పడి 14 రోజులు కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు. కాల్వకు నీటి విడుదల లేక వేలాది ఎకరాల పంట ఎండిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడ మండలం గణపవరం, తొగర్రాయి, బీక్యాతండా, ఎర్రవరం, రామలక్ష్మిపురం గ్రామాల్లో మంగళవారం ఆయన నీళ్లు లేక ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు ప్రజా సమస్యలను గాలికి వదలేసి కార్లలో షికార్లు చేస్తున్నారని విమర్శించారు. గండ్లు పూడ్చడానికి టెండర్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని, సాగర్ నిండా నీళ్లు ఉన్నా పంటలను బతికించుకోలేని పరిస్థితిలో రైతాంగం ఉన్నదని తెలిపారు. గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చి నీటి విడుదలకు చర్యలు తీసుకోకుంటే ప్రజా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఉద్దండు, మాజీ సర్పంచులు పొట్ట విజయకిరణ్, దొంగల లక్ష్మీనారాయణ, అన్నెం వెంకట్‌రెడ్డి, అమరబోయిన శ్రీనివాస్‌యాదవ్, గంటా శ్రీనివాస్, పోశం పూర్ణయ్య, కత్తి వెంకటేశ్వరావు, కత్తి రంగారావు, రైతులు పాల్గొన్నారు.

మాట తప్పిన ఉత్తమ్

అనంతగిరి : సాగర్ ఎడమ కాల్వకు నీళ్లు రాక ఎండుతున్న అనంతగిరి మండలంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పర్యటించారు. నీటి పారుదల శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆయన అన్నారు. వారంలో గండి పూడుస్తామని చెప్పిన ఉత్తమ్ 14 రోజులైనా మాట నిలబెట్టుకోలేక పోయారని దుయ్యబట్టారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్లా భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుగులోతు శ్రీనివాస్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు గండూరి సంతోష్, మట్టపల్లి సైదులు, ప్రసాద్, శ్రీనివాస్, కమల్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు బీసీ గురుకుల విద్యార్థులు

క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

నందికొండ, సెప్టెంబర్ 17 : సౌత్ జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బీసీ గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈ నెల 14న నల్లగొండలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14 విభాగంలో ఎం. గణేశ్, అండర్ 18 విభాగం 100 మీటర్ల పరుగులో ఎం. చందు, అండర్ 20లో జె. తరుణ్, 1500 మీటర్ల పరుగులో శివ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీంద్రాచారి, ఏటీపీ గాయత్రి, మాధవీలత, పీడీలు విజయ్, అరుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.